క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్ హుస్సేన్

పిడుగురాళ్ల: మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగించుకోవాలని సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికార సంస్థ ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జి చైర్మన్ ఎ.తౌషిద్ హుస్సేన్ సోమవారం తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల వారి ఆదేశాలతో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం పిడుగురాళ్ల పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జరుగుతుంది. కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసుల్లో రాజీ పడి పరిష్కరించుకోవాలన్నారు. పిడుగురాళ్ల కోర్టు పరిధిలోని కక్షిదారులు రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, చెక్ బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు, తదితర కేసులు రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

దుర్గి మార్కెట్ యార్డు చైర్మన్‌గా కౌశల్య


కొమ్ము కౌశల్య


గురజాల రామారావు

కారెంపూడి: దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా కారెంపూడికి చెందిన ఎస్సీ మహిళ కొమ్ము కౌశల్య నియమితులయ్యారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గౌరవ చైర్మన్‌గా, చైర్మన్‌గా కౌశల్య, వైస్ చైర్మన్‌గా గురజాల రామారావు మరో 18 మంది సభ్యులతో కూడిన కమిటీని ప్రభుత్వ ఆదేశాల మేరకు నియమిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. కమిటీ మెంబర్లుగా బొల్లెద్దు ఇన్నయ్య, చింతా లక్ష్మీనర్సయ్య, కందుకూరి కాశయ్య, బోయిన నర్సమ్మ, రమావతు లక్ష్మీ, మాచర్ల అన్నపూర్ణమ్మ, బైనబోయిన గోపమ్మ, దేవరకొండ సామ్రాజ్యం, బత్తుల రాజమ్మ, షేక్ సన్నాయిల జానమ్మ, కాయితి వెంకటరెడ్డి, కపలవాయి సూర్యనారాయణ, చింతా చిన నరసింహారావు, పాలువాయి పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, మాచర్ల హార్టికల్చర్ ఆఫీసర్, ఆత్మకూరు సర్పంచ్‌లు మెంబర్లుగా నియమితులయ్యారు.

నెలాఖరులోపు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి



మాచర్ల: మాచర్ల తాలూకా పరిధిలోని విశ్రాంత ఉద్యోగులంతా ఫిబ్రవరి 29వ తేదీ లోపు మాచర్ల పట్టణంలోని రూరల్ స్టేషన్ పరిధిలో సబ్ ట్రెజరీ కార్యాలయంలో తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని ఎస్టీవో కేతావత్ రామనాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పింఛన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులు తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికెట్‌ను ఇవ్వాలన్నారు. ఇవ్వకపోతే పింఛన్ ఆగిపోతుందనే విషయాన్ని గమనించి తప్పనిసరిగా ఎస్టీవో ఆఫీసులో సంప్రదించి లైఫ్ సర్టిఫికెట్‌ను ఇవ్వాలన్నారు.

ఆర్బీకేల్లో కంది పంటను విక్రయించాలి



దాచేపల్లి : ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన కంది పంటను ఆర్బీకేల్లో, వ్యవసాయ మార్కెట్ యార్డులో విక్రయించాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి దొండేటి పాపకుమారి అన్నారు. ఆర్బీకే, మార్కెట్ యార్డులో ప్రభుత్వం ప్రకటించిన క్వింటా రూ.9 వేల మద్దతు ధర చొప్పున కొనుగోలు చేస్తామని, ఈ ధర రోజు మార్కెట్ ధరకు అనుకూలంగా మారుతుందని ఏవో చెప్పారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతు కంది పంటను విక్రయించాలని కోరారు.

సత్రశాల దేవస్థానంలో సేవలకు పేర్లు నమోదు చేసుకోండి

రెంటచింతల: మండలంలోని సత్రశాలలో ప్రముఖ శైవ క్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో మార్చి 8న మహాశివరాత్రి సందర్భంగా వలంటీర్లుగా సేవలు అందించడానికి ఉత్సాహవంతులు పేర్లు నమోదు చేసుకోవాలని దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాశివరాత్రి పర్వదినాన రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు మల్లిఖార్జునస్వామి దర్శనం కొరకు వస్తారన్నారు. మంచి మనస్సుతో యువతీయువకులు వలంటీర్లుగా విధులు నిర్వహించడానికి ముందుకు రావాలన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్ నంబర్ 9030803175 సంప్రదించాలని కోరారు.

నేడు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభం

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో నూతనంగా రూ.85 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించనున్నట్లు చైర్మన్ కొప్పుల సాంబయ్య సోమవారం తెలిపారు.

సేవకు వందనం

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వలంటీర్లు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ ఇంటి ముందుకే చేరుస్తున్నారు. ప్రతి నెల 1వ తేదీనే సామాజిక పింఛన్‌లు లబ్ధిదారులకు అందిస్తున్నారు. కోవిడ్ కష్ట సమయంలోనూ ప్రాణాలకు తెగించి సేవలందించారు. క్షేత్ర స్థాయిలో సేవలందించి ఉత్తమ తీరును కనబరుస్తున్న వలంటీర్లే మా బలం.. మా బలగం అని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.

- జగనన్న సైన్యానికి సెల్యూట్
- ప్రభుత్వ విప్ పీఆర్కే


మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, కుర్రి సాయి

మాచర్ల రూరల్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్న వలంటీర్ల సేవలను మరువలేమని ప్రభుత్వ విప్ పీఆర్కే అన్నారు. సేవయే లక్ష్యంగా ప్రభుత్వానికి ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తూ ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి వేలాది మందిని పొట్టనపెట్టుకున్న విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవలందించిన జగనన్న సైన్యానికి సెల్యూట్ అని వలంటీర్ల వ్యవస్థను చూసి దేశ వ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయని, రాబోయే రోజుల్లో దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేయటం తథ్యమని పీఆర్కే స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలకు మీరే బ్రాండ్ అంబాసిడర్లు, గడప గడపకు మీరే ఆత్మబంధువులని, వేకువజామునే పింఛన్‌లు అందిస్తున్న సమాజ సేవకులు వలంటీర్లు అని ప్రశంసించారు. 299 మంది వలంటీర్లలో ఐదుగురికి సేవా రత్న, 286 మందికి సేవా మిత్ర ప్రశంసా పత్రాలు, అవార్డులు అందజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు బూడిద శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, ముక్కా గురవయ్య, నోముల కృష్ణ, యంగ్రగాలయ్య, శివారెడ్డి, శ్రీనివాస నాయక్, వెంకట్రామయ్య, ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, రంగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేయాలి

వెల్దుర్తి: వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేయాలని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఇళ్ల వద్దే అన్ని రకాల సంక్షేమ పథకాలను అందించేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. వలంటీర్లు వారికి కేటాయించిన గృహాలలో ఇంటింటికి తిరిగి అర్హులను గుర్తించి వారికి వచ్చే సంక్షేమ పథకాలను దరఖాస్తు చేయించి ఆ పథకాన్ని మంజూరు చేయిస్తారన్నారు. నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలను గృహాల వద్దనే అందిస్తున్నారన్నారు. నాల్గవ ఏడాది కూడా వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర బహుమతులను అందజేశామన్నారు. కరోనా సమయంలో వీరు కనబరిచిన ప్రతిభ అసాధారణమన్నారు. మండలంలో 262 మంది వలంటీర్లు ఉండగా ఆరు ఖాళీగా ఉన్నాయన్నారు. అందులో 256 మంది పని చేస్తుండగా ఐదుగురికి రూ.30 వేలు, మిగిలిన వారికి రూ.15 వేలు అందజేసినట్లు తెలిపారు. అంతకుముందు సీఎం జగన్ చిత్రపటానికి ప్రభుత్వ విప్ పీఆర్కే, నాయకులు, వలంటీర్లు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వలంటీర్లకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహులు, ఏవో ప్రసాద్, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన వలంటీర్లు

వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సీఎం జగనన్నకు రెండు కళ్లు

రెంటచింతల: దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రజలకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎర్రబాలెం కాలనీలోని షాదీఖానాలో ఎంపీడీవో శంకర్‌రావు అధ్యక్షతన వలంటీర్లకు వందనం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగనన్న పాలనలో నియోజకవర్గంలోని 5 మండలాలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు రూ.2,350 కోట్లు అందజేయడం జరిగిందన్నారు. మండలంలో పాలువాయి వలంటీర్ జానీబాషాకు సేవా వజ్ర, మరో ఐదుగురికి సేవా రత్న మిగిలిన 262 మందికి సేవా మిత్ర అవార్డులు అందజేసి సన్మానించారు. సర్పంచ్ పేర్ల చౌడమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మార్కొండారెడ్డి, ఎంపీపీ సంపూర్ణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు బ్రహ్మారెడ్డి, మాజీ ఎంపీపీ చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ శౌర్రెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ ఉమ, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఇన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామాల పార్టీ నేతలు తదితరులున్నారు.

చిరస్మరణీయుడు మహానేత వైఎస్సార్

జెట్టిపాలెం(రెంటచింతల): ఇచ్చిన మాట తప్పని మడమ తిప్పని మహానేతగా పేరుపొందిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయుడుగా నిలిచిపోతారని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జెట్టిపాలెం గ్రామ ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ విగ్రహానికి ఆయన పార్టీ నేతలతో కలసి భూమిపూజ చేసి మాట్లాడారు. వైఎస్సార్ రాష్ట్రంలోని పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు అమలు చేసిన ఆరోగ్యశ్రీ, రైతన్నల శ్రేయస్సుకు జలయజ్ఞం పథకం కింద చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువరన్నారు. వైఎస్సార్ ఆశయ సాధన కోసం ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దావులూరి నాగమ్మ, మాజీ సర్పంచ్‌లు మేకపోతుల బూరెడ్డి, శీలం అంజయ్య, పార్టీ నేతలు మేకపోతుల కృష్ణారెడ్డి, కుందురు నర్సింహారెడ్డి, దేగల సంసోన్, రమేష్ తదితరులున్నారు.


భూమి పూజలో మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, నాయకులు

సారంగధరేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



దాచేపల్లి : మండలంలోని సారంగపల్లి అగ్రహారం గ్రామ సమీపంలోని కొండపై సారంగధరేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఆలయ పూజారి తుమోజు భార్గవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ ఎంపీపీ కందుల జాను, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు ఈ భూమి పూజలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శానంపూడి అంకిరెడ్డి, అనుముల ఆంజనేయులురెడ్డి, ఎంపీటీసీ నంద్యాల వీరారెడ్డి, నాయకులు అనుముల రామిరెడ్డి, జాన్ అహ్మద్, చింతల దానియేలు, ఐలాపురం నరసింహారావు, రవి పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

మున్సిపల్ కమిషనర్ బీఎస్ గిరికుమార్

పిడుగురాళ్ల: వలంటీర్ల సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ బీఎస్ గిరికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటిలు తెలిపారు. పట్టణంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగాంగా సోమవారం వలంటీర్లకు అభినందన సభ నిర్వహించారు. పట్టణంలోని 311 మంది వలంటీర్లకు సేవా అవార్డులను అందించారు. అందులో సేవా వజ్ర ఒకరికి, సేవా రత్న ఐదుగురికి, సేవా మిత్రలుగా 305 మంది వలంటీర్లకు బహుమతులు ప్రదానం చేశారు. సేవా వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా మిత్రలకు రూ.15 వేలతోపాటు, ప్రసంసాపత్రం, మెడల్ అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వలంటీర్లకు అవార్డులు అందిస్తున్న కమిషనర్ గిరికుమార్, వైస్ చైర్మన్ ముక్కంటి, కౌన్సిలర్లు

నేడు వలంటీర్లకు వందనం

కారెంపూడి: ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్ల నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించనున్న వలంటీర్లకు వందనం షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి విడుదల చేశారు. కారెంపూడి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు వలంటీర్లకు వందనం కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు దుర్గి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొదటి కార్యక్రమం జరుగుతుందని, సాయంత్రం 5 గంటలకు మాచర్ల పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో కార్యక్రమం జరుగుతుందని పీవీఆర్ పేర్కొన్నారు. విశిష్ట సేవలందించిన వలంటీర్లను సన్మానించి వారికి ప్రభుత్వ విప్ పీఆర్కే అవార్డులను ప్రదానం చేయనున్నారని పార్టీ నాయకులు స్థానిక ప్రజా ప్రతినిధులు కేడర్ కార్యక్రమాలలో పాల్గొనవల్సిందిగా కోరారు.

బాలికలు ఉన్నతంగా రాణించాలి

మాచవరం: బాలికలు విద్యలో ఉన్నతంగా రాణించాలని హెచ్‌ఎం ఉమశ్రీ అన్నారు. మండలంలోని పిన్నెల్లి జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలికలకు అవగాహనా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బాలికలు రక్తహీనతకు గురకాకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, లింగ వివక్ష వలన కలిగే నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడ్యుకేషనల్ ఎపిఫని స్కాలర్‌షిప్‌కు ఆదర్శ పాఠశాల విద్యార్థిని

గురజాల : ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉషశ్రీ తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పేరం రామహరిత దీప్తి ఎంపికైందని తెలిపారు. విజయవాడలో ఫిబ్రవరి 17వ తేదీన విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ చేతులమీదుగా అవార్డు అందుకోవడం జరిగిందన్నారు. స్కాలర్ షిప్‌కు ఎంపికైన విద్యార్థినిని పలువురు అభినందించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

విజయపురిసౌత్: విజయపురిసౌత్ గ్రామంలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకొని గ్రామం పురవీధుల్లో ఛత్రపతి శివాజీ సైన్యం ఆధ్వర్యంలో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ సైన్యం సభ్యులు మాట్లాడుతూ విదేశీ రాజుల దండయాత్రను అడ్డుకొని భారతదేశం సనాత ధర్మాన్ని కాపాడి అపజయం లేని ఎన్నో యుద్ధాలు చేసిన నాయకుడు శివాజీ అన్నారు. తుల్జా భవాని అమ్మవారి ఆశీస్సులతో భవాని ఖడ్గం ధరించి ఛత్రపతి శివాజీ మహరాజ్‌గా పేరుగావించి భారత దేశ చరిత్రలో హిందూ ధర్మ దివిటీగా నిలిచాడన్నారు. ఆయన్ను స్మరించుకుంటూ ఈ శోభాయాత్ర చేయటం తమకు ఎంతో గర్వంగా ఉందని ఛత్రపతి శివాజీ సైన్యం సభ్యులు తెలిపారు.

పునాది బాగుంటే విద్యార్థుల భవిష్యత్ బాగుంటుంది

డీఈవో ఎం.వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల: విద్యా బోధనలో పునాది బాగుంటేనే విద్యార్థుల భవిష్యత్ బంగారు బాటగా మారుతుందని, అందుకు ఉపాధ్యాయులు శ్రద్ధతో పాఠ్యంశాలు బోధించాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు జరుగుతున్న వర్క్‌షాపు కార్యక్రమానికి ఆయన ఆకస్మికంగా సోమవారం హాజరయ్యారు. 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులతో డీఈవో మాట్లాడుతూ 1వ తరగతి విద్యార్థులకు శ్రద్ధతో విద్యాబుద్ధులు నేర్పిస్తే విద్యార్థుల భవిష్యత్ బాగుపడుతుందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతిలోనే ఉంటుంది. వారి భవిష్యత్‌కు ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. అలాగే డ్రాపవుట్‌లు 50 శాతం బోధన లోపం వలన జరుగుతాయని, విద్యార్థులకు వినడం, మాట్లాడటం వంటి ప్రాథమిక నైపుణ్యాలను నేర్పించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధ్యాయులకు ఓర్పు, సహనం అవసరం అన్నారు. హైస్కూల్లోని 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల నాడు–నేడు కార్యక్రమంతో బాగుందని తెలిపారు. మధ్యాహ్న భోజనం 1100 మంది విద్యార్థులు చేస్తున్నారు. 10వ తరగతి విద్యార్థులు 365 మంది ఉన్నారు. వారందరు పాస్ అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలని హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మికి సూచించారు. ప్రభుత్వం విద్యాపరమైన అన్ని సౌకర్యాలు కల్పించింది కనుక ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్‌కు తోడ్పడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ధనలక్ష్మి, రిసోర్స్ పర్సన్ ఎం.లక్ష్మణరావు, ప్రోగ్రాం జాయింట్ సెక్రటరీ జె.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

మాచర్లలో సామాజిక సాధికారతకు పెద్దపీట

కారెంపూడి: మాచర్ల నియోజకవర్గంలో నూరు శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక సాధికారత కల్పించిన ఘనత ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ అన్నారు. దుర్గి మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎస్సీ మహిళ కొమ్ము కౌశల్యకు ప్రభుత్వ విప్ పీఆర్కే కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు సోమవారం మాచర్ల వెళ్లి ప్రభుత్వ విప్ పీఆర్కేకు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. తర్వాత కారెంపూడి ఆర్ అండ్ బీ బంగ్లాలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన చిన ఏసోబుకు మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవితో పాటు, రెంటచింతలలో సంపూర్ణమ్మకు ఎంపీపీ పదవి, ప్రస్తుతం దుర్గి యార్డు చైర్మన్ పదవి ఎస్సీలకు దక్కడం.. పీఆర్కేకు ఎస్సీల పట్ల ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదలంతా ప్రభుత్వ విప్ పీఆర్కే వెంటే వంద శాతం ఉన్నారని, బ్రహ్మారెడ్డి వెంట అగ్రవర్ణాలే ఉన్నాయని అందుకే ఆయన ఫ్యాక్షన్ వల్ల లబ్ధి పొందాలని చూస్తున్నారని, దానికి మంచికల్లులో జరిగిన ఉదంతమే నిదర్శనమన్నారు. సుదీర్ఘకాలం గడప గడపకు కార్యక్రమం ప్రశాంతంగా జరిగిందని మంచికల్లులో స్టిక్కర్లు అంటించవద్దన్నందుకు టీడీపీ నాయకులు దాడి చేశారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ అంతరగడ్డ ఏసోబు మాట్లాడుతూ టీడీపీ నాయకులకు పేదలకు మేలు చేయడం చేతకాదని గొడవలు సృష్టించడం మాత్రం తెలుసన్నారు. మండల ఎస్టీ నాయకుడు యాకసిరి తిరుపతిరావు మాట్లాడుతూ తమ వైకుంఠపురం గ్రామం పుట్టి 40 ఏళ్లు అయిందని ఎక్కువ కాలం పాలించిన వారు ఏనాడు తమ ఊరిని పట్టించుకోలేదని ప్రభుత్వ విప్ పీఆర్కే వచ్చాక రూ.30 లక్షలతో అభివృద్ధి చేశారని అందరికి సంక్షేమం అందుతోందని అందరం సంతోషంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. సమావేశంలో చింతపల్లి ఎంపీటీసీ అచ్యుతరావు, నాగేశ్వరరావు, మర్రి శేషయ్య, కోట నాగభూషణం, రమావతు జాన్‌పాల్‌నాయక్, కడియం వెంక్రటావు, జి.ఎలీషా, మిద్దెపోగు ప్రవీణ్ పాల్గొన్నారు.


ప్రభుత్వ విప్ పీఆర్కేను సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు

రామారావు నియాకం పట్ల హర్షం..

దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా గురజాల రామారావును నియమించడం పట్ల వైఎస్సార్‌సీపీ కాపు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వారు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని సోమవారం కలసి ఎంతో కాలంగా పార్టీకి సేవలందిస్తున్న రామారావును గుర్తించి వైస్ చైర్మన్‌గా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పలిశెట్టి కోటేశ్వరరావు, కర్ణా శ్రీనివాసరావు, కిల్లా కాశి, జక్కా నరసింహారావు, పలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రామారావుకు వైస్ చైర్మన్ నియామక పత్రాన్ని పీఆర్కే అందించారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

మాచవరం: దేశంలోనే ఎక్కడా లేనివిధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని జెడ్పీటీసీ జె.శివాయదవ్ అన్నారు. మండలంలోని వేమవరం, చెన్నాయపాలెం, తురకపాలెం గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థ వారధిగా నిలిచిందన్నారు. వలంటీర్ల సేవలతో ప్రజలు ఎంతగానో సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వలంటీర్ల సేవలను గుర్తిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేవా రత్న, సేవా మిత్ర, సేవా వజ్ర అవార్డులు ప్రకటిస్తూ, పారితోషకం అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, గ్రామ సర్పంచులు గాదె కనకారెడ్డి, మండ్ల మంగమ్మ, షేక్ అల్లాభక్షు, ఎంపీడీవో సురేష్, ఈవోపీఆర్‌డీ వెంగళరావు, ఆయా గ్రామాల పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ముస్లింల అభివృద్ధి

బ్రదర్ సిరాజ్ ఉర్ రహమాన్

పిడుగురాళ్ల: విద్యతోనే ముస్లిం సమాజం అభివృద్ధి జరుగుతుందని పీస్ మెసేజ్ ఫౌండేషన్ ఫౌండర్, ఆధ్యాత్మిక ప్రసంగ కర్త బ్రదర్ సిరాజ్ ఉర్ రహమాన్ అన్నారు. పట్టణ జానపాడు రోడ్డులోని ఏడు కొట్ల సెంటర్‌లో ముస్లింల పురోగతి ఎప్పుడు ఎలా అనే అంశంపై పట్టణ ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో బహిరంగ సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీస్ మెసేజ్ ఫౌండర్ బ్రదర్ సిరాజ్ ఉర్ రహమాన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎండీ గఫార్ అధ్యక్షత వహించారు. బ్రదర్ సిరాజ్ ఉర్ రహమాన్ మాట్లాడుతూ ముస్లింలు తమ పిల్లల్ని ఎక్కువగా ఖురాన్ చదివిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో ముస్లింలు అన్ని రంగాల్లో ఎదగాలంటే ఖురాన్‌తోపాటు ఉన్నత విద్య ప్రతి ఒక్కరికి అవసరం అన్నారు. ఉన్నత విద్యను కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ముస్లిం తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. డాక్టర్లు, లాయర్లు, జడ్జిలు, ఇంజనీర్లు ఇలా ప్రతి రంగంలో ముస్లింలు రాణించాలంటే ఉన్నత విద్య తప్పనిసరి. అందుకే నేటి నుంచైనా పిల్లలకు ఉన్నత విద్య అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేస్తే ముస్లిం సమాజం అభివృద్ధి చెంది భావితరాలకు ఆదర్శంగా నిలుస్తారని చెప్పారు. అంతే కాకుండా రాజకీయంగా కూడా ముస్లింలు ఎదగాలి. అన్ని గ్రంథాలు దేవుడు ఒక్కడే అని చెబుతున్నాయని అన్నారు. ముస్లిం, హిందూ, క్రిస్టియన్ ఎవరైనా దేవుడి బిడ్డలే అన్నారు. అందరు కలసిమెలసి ఉంటేనే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పక్కన బ్రదర్ సిరాజ్ ఉర్ రహమాన్, ఎండీ గఫార్

వైఎస్సార్‌సీపీలో ముస్లింలకు అధిక అభివృద్ధి: ఎమ్మెల్యే కాసు

ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ బ్రదర్ సిరాజ్ ప్రసంగాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో ముస్లింలకు సముచిత స్థానం కల్పించి వారి అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే అంజాద్ బాషాను ఉప ముఖ్యమంత్రిని చేయడం మనందరికీ తెలిసిన విషయమే అని గుర్తు చేశారు. ఇక గురజాల నియోజకవర్గంలో ముస్లింలకు పెద్దపీట వేశాం అన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ముస్లింలు మరింతగా అన్ని రంగాల్లో ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రదర్ ఇస్మాయిల్, నియోజకవర్గంలోని ముస్లిం మత పెద్దలు, జమాత్ పెద్దలు, ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కనుల పండువగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి 68వ కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా సోమవారం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పూజారులు వేద మంత్రోచ్చారణలతో కార్యక్రమం నిర్వహించి, స్వామి వారి కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.